సమయ పాలన పాటించని ఉద్యోగులపై చర్యలు

- డీఎంహెచ్ఓ కోటాచలం
- జూనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు

మునగాల, ఫిబ్రవరి 27: సమయ పాలన పాటించని ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ కోటాచలం హెచ్చరించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం మునగాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు రేపాల పీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాటాడుతూ.. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో తిరిగి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కాగా, మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ జానీపాషా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గత 2 రోజులుగా విధులకు హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, ఫిబ్రవరి 27: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సొరంగం పనులు జరుగుతున్నప్పుడు లీక్ అవుతున్న నీటి ఊటను గమనించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారుల మీద, పాలకుల మీద ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ముందే గ్రహించి సొరంగం పనిని ప్రారంభించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కమీషన్ల కోసం కక్కుర్తి పడి సొరంగం పనులను హడావుడిగా ప్రారంభించడంతో కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బొజ్జ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి.. ఆరుగురిపై కేసు

స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లతో ఎస్ఐ వీరన్న, పశుసంవర్ధకశాఖ అధికారులు

మద్దిరాల, ఫిబ్రవరి 27: మండలంలోని చందుపట్ల గ్రామంలో కోడి పందేల స్థావరంపై గురువారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ వీరన్న తెలిపారు. చందుపట్లకు చెందిన పాల్వాయి సురేశ్, కొరివి మహేశ్, మరిపెడ మండలం ఊకల్ గ్రామానికి చెందిన గార్ల లక్ష్మణ్, భూక్య శ్రీను, తుంగతుర్తి మండలం పస్తాల గ్రామానికి చెందిన బొజ్జా యల్లయ్య, నూతనకల్‌కు చెందిన నాగరాజు అనే వ్యక్తులు నాలుగు కోళ్లతో పందేలు నిర్వహిస్తుండగా దాడి చేసినట్లు తెలిపారు. నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకొని 16 కోడి కత్తులు, రెండు బైకులు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి కోళ్లను పశుసంవర్ధకశాఖ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక సాయం

గురువయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నూతనకల్, ఫిబ్రవరి 27: మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన దేశపంగు గురువయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గురువారం గురువయ్య కుటుంబానికి బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే ఆర్థికంగా చేయూత అందించాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ చేసిన సూచనల మేరకు ఆర్థిక సాయం అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, నాయకులు మున్న లింగయ్య, దేశపంగు మధు, ఉప్పల మల్లయ్య, దేశపంగు మైసయ్య, కనిగంటి వీరయ్య, దేశపంగు వెంకన్న, మాదాసు విజయ్, గంగయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

'ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం'

తానీల్దార్ శ్రీనివాసులుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సభ్యులు

అర్వపల్లి, ఫిబ్రవరి 27: ధ్యానంతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఇన్‌ఛార్జి గిరి అన్నారు. ఈ నెల 3,4,5 తేదీల్లో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో అర్వపల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న ఉచిత యోగ ధ్యానోత్సవ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు గురువారం తానీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు కార్యక్రమ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కోఆర్డినేటర్లు రంగారావు, వెంకటయ్య, శేఖర్, ఉపేందర్‌తో పాటు రమేశ్, శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకట్, వీరయ్య, సతీశ్, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని తాళ్ల మల్కాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మామిడి ఆశ్రిత జన్మదినోత్సవం సందర్భంగా గురువారం భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మామిడి సౌజన్యలక్ష్మణ్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను

ఆర్య వైశ్య అబ్బాయి 1989, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 14x2=28 వేలు, ఆస్థి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు. NLG-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | రామన్నపేట: 9182777638

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

- జిల్లాలో 94.97 శాతం ఓటింగ్ నమోదు

చివ్వెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట, ఫిబ్రవరి 27: వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సాగిన పోలింగ్‌లో 2,664 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 2,530 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా 94.97 శాతం ఓటింగ్ నమోదయింది. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ జిల్లా కేంద్రంలోని ఆనంద్ విద్యా మందిర్(ఏవీఎం)లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూం నుంచి అదనపు కలెక్టర్ రాంబాబు పోలింగ్ సరళిని వెబ్‌కాస్ట్ ద్వారా పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బాక్స్‌లను సీజ్ చేసి నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. ఈ ఎన్నికలో మెడికల్ కళాశాల అధ్యాపకులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మఠంపల్లి: మఠంపల్లిలో 100 శాతం పోలింగ్ నమోదయింది. 34 ఓట్లు ఉండగా అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నేరేడుచర్ల: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. హుజూర్‌నగర్‌లో 96 శాతం, మేళ్లచెర్వులో 95 శాతం, పాలకవీడులో 91 శాతం పోలింగ్ నమోదయింది.

గరిడేపల్లి: మండల వ్యాప్తంగా 94 మంది ఓటర్లు ఉండగా 89 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 94.68 శాతం పోలింగ్ నమోదయింది.

కోదాడ: కోదాడ డివిజన్‌లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 712 మంది ఓటర్లు ఉండగా 678 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95.22 శాతం పోలింగ్ నమోదయింది. మండలాల వారీగా కోదాడలో 472 మందికి 457, నడిగూడెంలో 48 మందికి 44, చిలుకూరులో 102 మందికి 97, అనంతగిరిలో 25 మందికి 24 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మునగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 65 ఓట్లకు గాను 56 మంది ఓటు వేశారు. 86.15 శాతం పోలింగ్ నమోదు అయినట్లు సీఈఓ స్వర్ణ తెలిపారు. పోలింగ్ సరళిని ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు.

తిరుమలగిరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో మొత్తం 59 ఓట్లకు గాను 56 మంది ఓటు వేయగా, 95 శాతం పోలింగ్ జరిగింది.

మోతె: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 48 ఓట్లకు గాను 44 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని పీఓ నాగలక్ష్మి, ఎంపీడీఓ ఆంజనేయులు, సీఐ రామకృష్ణారెడ్డి సందర్శించారు.

అర్వపల్లి: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో 23 ఓట్లకు గాను అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 100 శాతం పోలింగ్ జరిగింది.

తుంగతుర్తి: స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో 54 ఓట్లకు గాను 51 మంది ఓటు వేశారు. మండలంలో 94.44 శాతం పోలింగ్ నమోదయింది. పోలింగ్ కేంద్రాన్ని డీఎస్పీ రవి పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.

మద్దిరాల: మండలంలో 29 మంది ఓటర్లు అందరూ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 100 శాతం పోలింగ్ నమోదయింది. పోలింగ్ సరళిని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు పరిశీలించారు.

సూర్యాపేటలోని ఏవీఎం స్కూల్‌లో బారులుదీరిన ఓటర్లు

కోదాడలో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ జడ్పీహెచ్ఎస్ పోలింగ్ కేంద్రంలో 52 ఓట్లకు 49 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

ఆత్మకూర్.ఎస్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 52 ఓట్లకు గాను 50 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ వేణుమాధవరావు, సూర్యాపేట డీఎస్పీ రవి, తానీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ తదితరులు పరిశీలించారు.

నాగారం: మండల కేంద్రంలో 23 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 100 శాతం పోలింగ్ నమోదయింది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రం సూర్యాపేటలోని ఏవీఎం పాఠశాలలో పోలింగ్ సరళిని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఎస్పీ వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ఎస్ఐ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

చివ్వెంల: మండలంలో మొత్తం 117 ఓట్లకు గాను 113 పోల్ అయ్యాయి. పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, డీఎస్పీ రవి, తానీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

సూర్యాపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

మద్దిరాలలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

మఠంపల్లి: ఓటు హక్కు వినియోగించుకున్న ఎంఈఓ వెంకటాచారి

ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- ఆర్డీఓ శ్రీనివాసులు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

మఠంపల్లి, ఫిబ్రవరి 27: ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆర్డీఓ శ్రీనివాసులు అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏఈ, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో లబ్ధిదారుల ఎంపిక రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక పకడ్బందీగా చేపట్టాలని కోరారు. సమావేశంలో తానీల్దార్ మంగా రాథోడ్, ఎంపీడీఓ జగదీశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాములు

సమావేశంలో మాట్లాడుతున్న రాములు

నడిగూడెం, ఫిబ్రవరి 27: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ములకలపల్లి రాములు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను, కార్మికులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను తక్షణమే పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బెల్లంకొండ సత్యనారాయణ, కొరట్ల శ్రీను, ఏనుగుల వీరాంజనేయులు, లతీఫ్ బాబు, మస్తాన్, సైదులు, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

'టీబీ రహిత తెలంగాణకు కృషి చేయాలి'

మాట్లాడుతున్న వైద్యాధికారి మాధవకుమార్

గరిడేపల్లి, ఫిబ్రవరి 27: టీబీ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కల్మల్‌చెర్వు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాధవకుమార్ అన్నారు. గురువారం మండలంలోని సర్వారం గ్రామంలో నిర్వహించిన నిక్షయ్ శివిర్ క్యాంపులో ఆయన మాట్లాడారు. క్యాంపులో 50 మందికి తెమడ పరీక్షలు,108 మందికి ఎక్స్‌రే తదితర టెస్టులు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లయ్య, సంధ్యారాణి, సురేంద్ర, రవళి, శృతి, సంధ్య, సునీత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి'

రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 27: గుంపుల తిరుమలగిరి గ్రామం నుంచి భక్తళాపురం, నేలమర్రి, గాజులమల్కాపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భక్తళాపురం గ్రామంలో నేలమర్రి సరిహద్దులో గ్రామస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. రోడ్డు నిర్మాణానికి రూ.3.60 కోట్లు నిధులు మంజూరు చేశారని, టెండర్ వేసి కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నా రెండేళ్లుగా రోడ్డు నిర్మాణం చేపట్టకుండా జాప్యం చేస్తున్నారని, దీంతో నిధులు వెనక్కి పోయే ప్రమాదముందన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జుట్టుకొండ గణేశ్, సీపీఎం గ్రామ కార్యదర్శి ఇరుగు రమేశ్, బుస్సా రామయ్య, నెమ్మాది వీరయ్య, గోపాల్‌దాసు శ్రీరాములు, సుంకరి వెంకటేశ్వర్లు, కిరణ్, నవీన్, పాపయ్య, జ్యోతి బసు, చిరు తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 27: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి సంతోశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని సెలవు ప్రకటించామని, వ్యాపారులు, రైతులు సహకరించాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మోతె, ఫిబ్రవరి 27: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ సైదాబీ నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. బుధవారం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని రూ.15 వేలు కనిపించలేదు. దీంతో స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.

మేళ్లచెర్వులో హుక్కా కలకలం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 27: మేళ్లచెర్వులో హుక్కా వాడకం వార్త కలకలం సృష్టించింది. బుధవారం రాత్రి కోదాడ రోడ్డులోని ఓ ఇంట్లో హుక్కా తాగుతున్న 8 మందిని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. హుక్కా ఎక్కడి నుంచి రవాణా చేస్తున్నారనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల మత్తు పదార్థాల కట్టడికి పోలీసులు ఎంత ప్రయత్నిస్తున్నా పలువురు యువత వాటికి బానిసలుగా మారుతున్నారు. పోలీసు యంత్రాంగం పటిష్ట నిఘా ఉంచి మత్తు పదార్థాలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయస్థాయి పోలీస్ కబడ్డీ పోటీలకు ఎంపిక

నేరేడుచర్ల, ఫిబ్రవరి 27: జాతీయస్థాయి పోలీస్ కబడ్డీ పోటీలకు మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన దారముళ్ల వంశీ ఎంపికయ్యారు. వంశీ నల్లగొండ పోలీస్ బెటాలియన్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మార్చి 2 నుంచి 6వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో వంశీ తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

అధికారులకు సేవాలాల్ జయంతి ఉత్సవ ఆహ్వానం

గరిడేపల్లి, ఫిబ్రవరి 27: హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవానికి హాజరు కావాలని కోరుతూ తానీల్దార్ కవిత, ఎంపీడీఓ సరోజ, ఎస్ఐ నరేశ్‌కు గిరిజన సంఘం నాయకులు గురువారం ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాణోతు వెంకటేశ్వర్లు నాయక్, బాణోతు శ్రీనివాస్ నాయక్, సైదా నాయక్, వాంకుడోతు హుస్సేన్, జయరాం నాయక్, బాణోతు శివ నాయక్, గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి జాతర

- ఉత్సాహంగా సాగుతున్న ఎద్దుల పందేలు

మేళ్లచెర్వు: స్వామివారి కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 27: మేళ్లచెర్వులోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర వైభవంగా సాగుతోంది. జాతర రెండో రోజైన గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. టీటీడీ కల్యాణ మండలంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం రెండోరోజూ కొనసాగింది. జాతర సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు ఉత్సాహంగా నడుస్తున్నాయి. కాగా, మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి తర్వాత ఇష్టకామేశ్వరి సహిత స్వయంభు శంభులింగేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

శివపార్వతుల కల్యాణం..

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి పిల్లలమర్రి గ్రామంలోని ఎరకేశ్వరస్వామి ఆలయం ఎదుట గురువారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా నామేశ్వరస్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను పల్లకీలలో ఎరకేశ్వరస్వామి ఆలయానికి తీసుకొచ్చి, అనంతరం కల్యాణం జరిపారు.

ఎద్దుల పందేలలో బండ లాగుతున్న గిత్తలు

కబడ్డీ పోటీలు ప్రారంభం

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ జానయ్య గౌడ్ తదితరులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 27: మండలంలోని నాగులపహాడ్ త్రికుటేశ్వరాలయం జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి గ్రామీణ కబడ్డీ, కోలాటం పోటీలను ఆలయ కమిటీ చైర్మన్ పోగుల జానయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి కొండ జానకిరాములుగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగంధర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉప చైర్మన్ దేవయ్య, సభ్యులు పాలకూరి రవి, సతీశ్, బక్కయ్య, సంకరమద్ది జగ్గారెడ్డి, సోమయ్య, నాగయ్య, ఎదుళ్ల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నిరుద్యోగ యువతకు శిక్షణ

రామగిరి, ఫిబ్రవరి 27: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో కస్టమర్ సర్వీస్ రంగంలో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా శిక్షణ అందిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన హెచ్ఆర్‌హెచ్ నెక్స్ సర్వీస్ పబ్లిక్ లిమిటెడ్ హెచ్ఆర్ వై. ప్రియా మాధురి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 10 వరకు నల్లగొండలోని ఐటీటవర్‌లో నిర్వహించే శిక్షణకు 18 ఏళ్లు పైబడిన ఇంటర్ విద్యార్హత ఉండి హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషలు వచ్చిన వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైన వారికి రూ. 11, 500 స్టైఫండ్ అందిస్తామని, ప్రతిభ చూపిన 50 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం

డిండిలో హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

డిండి, ఫిబ్రవరి 27: దోమలపెంట వద్ద ఉన్న ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1ను పరిశీలించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావుకు గురువారం డిండి మండల కేంద్రంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్‌తో జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, పల్లె రవికుమార్ గౌడ్, యాదయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.